ప్రజాశక్తి
గురువారం 24 అక్టోబర్ 2024 5 అనంతపురం



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం శివారు ప్రాంతాల్లో భారీ వర్షం, వరదతో నష్టపోయిన బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. బుధవారం సాయంత్రం అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామం వద్దనున్న ఇందిరమ్మ కాలనీలో వరద బాధితులకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మలు వీటిని అందించారు. ఒక్కో కుటుంబానికి బియ్యం 25 కిలోలు, కంది బేడలు 1కిలో, పామోలిన్ 1 లీటర్, ఉల్లిగడ్డలు 2 కిలోలు, బంగాళా దుంపలు 2 కిలోలు చొప్పున గుర్తించిన 202 మంది వరద బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధిత కుటుంబాలను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. పూర్తిస్థాయిలో నష్టాన్ని అంచనావేసి త్వరలో ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంతబాబు, సివిల్ సప్లయ్ డిఎం రమేష్ రెడ్డి, డీఎస్వో వెంకటేశ్వర్లు, తహశీల్దార్ మోహన్ కుమార్, డీఎల్డీవో లలితబాయి, డిటి మంజునాథ్, ఆర్ఐ సందీప్, సిఎస్డిటిలు ఇంతియాజ్, రామకృష్ణ పాల్గొన్నారు.

ముంపు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

మరో రెండు రోజులు పాటు భారీ వర్షాలు కురువనున్న నేపథ్యంలో జిల్లాలో ప్రవహిస్తున్న హగరి, చిన్న హగరి, పెన్నా, చిత్రావతి, పండమేరు నదుల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నదులు, రిజర్వాయర్ల పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వర్షం తగ్గేంత వరకు ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు.

వీడని వానగండం

◆ అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

◆ వరద ముంపు నుంచి బయటపడుతున్న ప్రాంతాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాను వాన గండం వీడటం లేదు. మరో రెండు రోజులు వర్షాలుండే అవకాశముందని జిల్లా కలెక్టర్లు ప్రకటించారు. ముఖ్యంగా అనంతపురం శివారు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు జిల్లో పలు ప్రాంతాలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఇప్పుడిప్పుడే మంపు ప్రాంతాలు తేరుకుంటున్నాయి. అంతలోనే మరో రెండు రోజుల వర్షాల హెచ్చరికతో సర్వత్రా గుబులు నెలకొంది. అనంతపురం నగర శివార్లలో పండమేరు ఉధృతితో పంటలు దెబ్బతిన్నాయి. వందల ఇళ్లు నీట మునిగాయి. కణేకల్ ప్రాంతంలో హగరి నదినీ నీటి ప్రవాహం ఉంది. కర్నాటకలో ఎగువ ప్రాంతాల్లో వర్షాలొస్తుండటంతో పెన్నా, చిత్రావతి నదుల్లోనూ నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ నదీ పరివాహక ప్రాంతాలల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు.

సాగుతున్న నష్టం అంచనాలు

ఎగువ ప్రాంతాల్లో పడుతున్న భారీ వర్షాలతో చెరువులు కుంటల్లో నీరు అధికంగా చేరడంతో జిల్లాలో పండమేరుకు, హగరి నదులకు వర్షాలు ఉధృతంగా పడుతున్నాయి. ప్రధానంగా పండమేరు అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో మొత్తం ఎనిమిది చోట్ల వరదల్లో ఇళ్లు నీట మునిగాయి. 365 ఇళ్లు నీట మునిగాయి. ఇందులో అనంతపురం నగర శివార్లలోని కళాకరుల కాలనీ, రామకృష్ణ కాలనీతోపాటు ఉప్పరపల్లి, బండమీదపల్లి గ్రామాల పరిధిలో నష్టం జరిగింది. ఏ మేరకు నష్టం జరిగిందన్నది ఇంకా అంచానలను అధికారులు వేస్తున్నారు. నీట మునిగిన ఇళ్లలోని వారికి మూడు సహాయక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో ఇంకా 65 మంది ఉన్నట్టు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. నష్టం అంచనాలు పూర్తయిన తరువాత డ్రై రేషన్ పంపిణీని చేపట్టనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఐదు మండలాల్లో వర్షాభావం

ఒకవైపు జిల్లాను వానలు ముంచెత్తుతుంటే ఇప్పటికే వర్షాభావ పరిస్థితులున్న మండలాలుండటం గమనార్హం. అనంతపురం జిల్లా పరిధిలో 31 మండలాలుంటే ఐదు మండలాల్లో వర్షాభావం నెలకొంది. తాడిపత్రి, పెద్దపప్పూరు తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నాయి. యాడికి, గుత్తి, యల్లనూరు మండలాల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. తాడిపత్రిలో 84.7 మిల్లిమీటర్లు సాధారణ వర్షపాతమైతే 34.1 మిల్లిమీటర్లు మాత్రమే నమోదయింది 59.7 శాతం తక్కువగా పడింది. తాడిపత్రిలో 119.6 మిల్లిమీటర్లు సాధారణ వర్షపాతమైతే 47.6 మిల్లిమీటర్లు మాత్రమే పడింది. 60.2 శాతం తక్కువ పడింది. యల్లనూరు మండలంలో 121.8 మిల్లిమీటర్లు అవుతే 75.8 మిల్లిమీటర్లు మాత్రమే పడింది. 37 శాతం తక్కువ పడింది. గుంతకల్లు మండలంలో 93.7 మిల్లిమీటర్లు సాధారణ వర్షపాతమైతే 40.6 శాతం తక్కువ పడింది. ఇలా ఇంతటి పరిస్థితుల్లోనూ వర్షాభావం నెలకొనడం గమనర్హాం.

బిటి ప్రాజెక్టు దిగువకు నీరు విడుదల

బిటి ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న నీరు

ప్రజాశక్తి-రాయదుర్గం

భైరవాని తిప్ప ప్రాజెక్టు నీటితో పూర్తిస్థాయిలో నిండిన నేపథ్యంలో జల వనరుల శాఖ అధికారులు ఒక గేటును అడుగు మేరకు ఎత్తి దిగువకు వేదవతి నదిలోకి విడుదల చేశారు. మంగళవారం అర్ధరాత్రి ఒక గేటును ఎత్తి నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1655 అడుగులు కాగా ప్రస్తుతం ఇనోఫ్లో 1760 క్యూసెక్కులు ఉంది. అవుట్‌ఫ్లో 806 ఉంది. 1654.2 అడుగుల మేర నీరు నిల్వ ఉందని జల వనరుల శాఖ ఇంజినీర్ సాయిరాం తెలిపారు. రిజర్వాయర్ పూర్తిగా నీటితో నిండిన నేపథ్యంలో రిజర్వాయర్ వద్ద గంగపూజ చేసేందుకు రాయదుర్గం, కళ్యాణదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు గురువారం ప్రాజెక్టు వద్దకు రానున్నట్లు టిడిపి గుమ్మగట్ట మండల కన్వీనర్ గిరిమల్లప్ప తెలిపారు.

పండమేరు పాత బ్రిడ్జిపై రాకపోకలు బంద్

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై ఉన్న పండమేరు పాత బ్రిడ్జిను మరమ్మతుల నిమిత్తం వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిషేధించినట్లు అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరి, ధర్మవరం, రాప్తాడు నుంచి రాకపోకలు సాగించే వాహనాలు పండమేరు కొత్త బ్రిడ్జి మీద రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. ఒకే బ్రిడ్జిపై రాకపోకలు చేయాలన్నారు. ఈ విషయాన్ని వాహనదారులు గుర్తించి పోలీసులతో సహకరించాలన్నారు.

స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు బికెఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-17, 14 బాల, బాలికల బాస్కెట్‌బాల్ ఉమ్మడి అనంతపురం జిల్లా ఎంపికలు ఈనెల 21వ తేదీన అనంతపురం అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగాయి. జిల్లా స్థాయి ఎంపికలలో బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి అనంతపురం జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పీడీ గోపాల్ రెడ్డి తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో ఎస్.యగ్నేష్ యశ్వంత్ అండర్-17 బాలికల విభాగంలో పి.నాగనందినిలు ఎంపికయ్యారు. వీరు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అండర్-14 బాలుర విభాగంలో కె.గణేష్, జె.రాజు, అండర్-14 బాలికల విభాగంలో నేహా, భావనలు ఎంపికయ్యారు. వీరు నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు వసుంధర, వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి, లలితమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలికలు ధైర్యంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బాలిక సమస్యను ఎదిరించేలా ధైర్యంగా ముందుకు సాగాలని సిఐ కరుణాకర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐతో పాటు ఆర్డీటీ డైరెక్టర్ శ్రీబాలాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసాంఘిక శక్తులను ఎదుర్కొనే శక్తి రావాలంటే బాలకులు బాగా చదవి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధర, ఏటీఎల్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిపిఎం ప్రాంతీయ కమిటీ ఎన్నిక

ఎ.రంగారెడ్డి,

ఎన్.మధుసూదన్

ప్రజాశక్తి-ఉరవకొండ టౌన్

సిపిఎం ఉరవకొండ ప్రాంతీయ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. విడపనకల్, బెలుగుప్ప, ఉరవకొండ ప్రాంతీయ కమిటీ కార్యదర్శిగా ఏ.రంగారెడ్డి, ఉరవకొండ ఆర్గనైజింగ్ మండల కమిటీ కన్వీనర్‌గా ఎన్.మధుసూదన్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా మురళి, రవికుమార్, రామాంజనేయులు నాయక్, శ్రీనివాసులు, సిద్ధప్ప, వీరాంజనేయులు తదితరులను ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ వెడల్పుకు బడ్జెట్లో నిధులు కేటాయించాలన్నారు. హంద్రీనీవా నుంచి రోజుకు 4000 క్యూసెక్కుల నీరు తీసుకునేలా హెచ్ఎల్‌సి ఆధునీకరణ పనులు చేపట్టాలని కోరారు.

పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి

ఎపి రైతుసంఘం

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో సోమవారం రాత్రి కుండపోత వర్షంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వరి వేరుశనగ, మొక్కజొన్న, అరటి, చీనీ, మిరప, మామిడి, కళింగర, కర్బూజ, దానిమ్మ పంటలు దెబ్బతిన్నాయన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా షరతులు లేకుండా పంట నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. గత సంవత్సరం 2023 ఖరీఫ్, రబీలో అతివష్టి, అనావష్టి వల్ల నష్టపోయిన రైతాంగానికి పంటల బీమా ప్రకటించాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులనూ మరమ్మతులు చేయడానికి నిధులు కేటాయించి పనులు చేపట్టాలన్నారు.

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రెవెన్యూ డివిజన్లోని ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 49 అంగన్వాడీ పోస్టులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. నగరంలోని ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బళ్లారి నున్న శ్రీదేవి, ఆర్డీవో వసంత బాబు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, నార్పల, తాడిపత్రి, శింగనమల, ఉరవకొండ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 49 పోస్టులకుగాను 161 మంది దరఖాస్తు చేసుకున్నారు. 139 మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా, 22 మంది గైర్హాజరయ్యారు. ఏడు అంగన్వాడీ మెయిన్ పోస్టులకు 43 మంది దరఖాస్తు చేసుకోగా, 37 మంది హాజరయ్యారు. నాలుగు మినీ వర్కర్ పోస్టులకు 10 మంది దరఖాస్తు చేసుకోగా, అందరూ హాజరయ్యారు. 38 ఆయా పోస్టులకు 108 మంది దరఖాస్తు చేసుకోగా 92 మంది ఇంటర్వ్యూకు వచ్చారు. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు చల్లా లలిత, ధనలక్ష్మి, సాజిదా, ఉమాశంకరమ్మ, భారతి, డిప్యూటీ డిఎంహెచ్ఒ సుజాత పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ఆందోళనలు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధు, పరమేష్

సమావేశంలో మాట్లాడుతున్న ఓతూరు పరమేష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధు ఓతూరు పరమేష్ తెలిపారు. గణేనాయక్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ డిగ్రీ, ఇంజినీరింగ్, బి-ఫార్మసీ తదితర ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ దాదాపు రూ.3480 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా తాము అధికారంలోకి వస్తే నెల రోజుల్లో రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చి 120 రోజులు అవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి మాట్లాడడం లేదన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 1,3,5 సెమిస్టర్ల పరీక్ష ఫీజులు కట్టాలని కళాశాలల యాజమాన్యాల నుంచి విద్యార్థులపై ఒత్తిడి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో భాగంగా ఈనెల 28,29,30వ తేదీల్లో జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 6న చలో కలెక్టరేట్ చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని చెప్పిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వైటిసి.రమేష్, వెంకటేష్, తరమెల గిరి, శింగనమల సూర్య ప్రకాష్, శివ, భీమేష్, వంశీ పాల్గొన్నారు.

అనంతకు మహిళా మార్టులు తీసుకొస్తాం

అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

మెప్మా అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అనంతపురం నగరంలో మహిళా మార్టులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెల్లడించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో డీఆర్డీఏ, మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు అందుతున్న రుణాలు తదితర వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో ఎలాంటి అక్రమాలు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. అర్హత లేకుండా పింఛన్లు తీసుకుంటున్న వారిని గుర్తించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. ఇందులో భాగంగా అనంతపురం నగరంలో మహిళా మార్టులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేయాలని సూచించారు. భవనాలు ఖాళీగా ఉంటే మహిళా సంఘాలకు కమ్యూనిటీ హాళ్లగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్య, మెప్మా పీడీ విశ్వజ్యోతి, ఏరియా కోఆర్డినేటర్ సుభద్రమ్మ, కమ్యూనిటీ కోఆర్డినేటర్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.

2న ఎరువులు, విత్తన పురుగు మందుల

డీలర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లు వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, ఎన్నికలను నవంబర్ 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎం.సురేష్ రెడ్డి, కార్యదర్శి సిరుగుప్ప వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశం అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డు రజాక్ ఫంక్షన్ హాల్ ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో గత అసోసియేషన్‌కు సంబంధించిన జమ, ఖర్చుల వివరాలపై సభ్యుల ఆమోదంపై చర్చ జరుగుతుందన్నారు. అనంతరం 2024 నుంచి 2027 సంవత్సరం కాల పరిమితికి నూతన కార్యవర్గంను ఎన్నుకోనున్నట్లు చెప్పారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఉమ్మడి అనంతపురం జిల్లా సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికకు షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి, రాష్ట్ర కార్యదర్శి ఎన్.అశోక్ రెడ్డి విడుదల చేశారు. అక్టోబర్ 23 నుంచి 28 వరకు నామినేషన్ల స్వీకరణ, 29న నామినేషన్ల పరిశీలన, అదేరోజు ఉపసంహరణ, 2న ఎన్నికలు జరుగుతాయి. అదే రోజు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుంది. పోటీ చేయాల్సిన వారు అధ్యక్ష స్థానానికి రూ.20 వేలు, ఉపాధ్యక్షులు రూ.10వేలు, ప్రధానకార్యదర్శికి రూ.15 వేలు, కార్యదర్శులకు రూ.5 వేలు, కోశాధికారికి రూ.10 వేలు, కార్యవర్గసభ్యులు రూ.2వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఒకపోస్టుకు ఒకరు మాత్రమే సభ్యులుగా నామినేషన్లు వేయాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రంను కమిటీకి సంబంధించిన జిల్లా వాట్సప్ గ్రూపులో ఉంచారు. నామినేషన్లు మొదటి రోజు బుధవారం నాడు కార్యదర్శి స్థానానికి రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి.

ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం

సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఒ

ప్రజాశక్తి-యల్లనూరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఎంపిడిఓ వాసుదేవర రెడ్డి బుధవారం స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ పంచాయతీ లకు నియమించిన నూతన ఫీల్డ్ అసిస్టెంట్‌లు వారి విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆయా పంచాయతీల్లో కూలీల సంఖ్యను బట్టి ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు వేతనాలు ఉంటాయన్నారు. పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సన్న చిన్నకారు రైతుల పొలాల్లో ఫారం పాండ్, మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి టెక్నీకల్ అసిస్టెంట్‌లు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో షబ్బీర్, ఈసి బబులు, టెక్నీకల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిఒలు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒను కలిసిన ఉపాధ్యాయులు

ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వాసుదేవరరెడ్డిని జిల్లా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం కలిశారు. పాఠశాల ముందు ఆవరణలో వర్షపు నీరు నిలబడడంతో ఇబ్బందిగా ఉందని, దానిని తొలగించే ఏర్పాటు చేయాలని ఆయన్ను కోరారు.

కుందుర్పిలో మట్కా,పేకాట..!

జూదరులకు పోలీసుల సహకారం అందిస్తున్నట్లు విమర్శలు

ప్రజాశక్తి -కుందుర్పి

కుందుర్పి మండలంలో విచ్చలవిడిగా మట్కా, పేకాట జరుగుతున్నట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండల పరిధిలోని ఎనుముల దొడ్డి గ్రామ పంచాయతీలో పెద్ద ఎత్తున పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ ఆడేందుకు కంబదూరు, కళ్యాణదుర్గం, శెట్టూరు, కుందుర్పి మండలాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. జూదరులు బహిరంగంగా గ్రామ చివర్లో రోజుకు ఒకచోట పేకాటను నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ ప్రజలు చెబుతున్నారు. ఎనుమలదొడ్డి గ్రామంలో సైతం ఓ ఇంట్లో పేకాట ఆడిస్తున్నట్లు తెలుస్తోంది. బెస్తరపల్లి గ్రామశివారులో నిర్వహిస్తున్న పేకాటలో నిత్యం లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. కర్నాటక సరిహద్దు ప్రాంతమైన మలయనూరు పంచాయతీలో కొంతమంది పేకాట నిర్వహిస్తూ లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. ఎర్రగుంట గ్రామశివారులో పేకాటశిబిరం నిర్వహించే నిర్వాహకులు గ్రామ నలుమూలలా వారికి సంబంధించిన వ్యక్తులను ఏర్పాటు చేసుకుని పోలీసులు వస్తే సమాచారం ఇచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. జంబుగుంపల పంచాయతీ కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ప్రతిరోజూ పేకాట జరుగుతున్నట్లు ఆగ్రామస్తులు బహిరంగంగానే చెబుతున్నారు. పేకాటతో పాటు మండంలో కొందరు మట్కాను కూడా నిర్వహిస్తున్నారు. పేకాట నిర్వాహకులు కొందరు పోలీసులకు డబ్బులు ఇచ్చి అటువైపు వారు రాకుండా చూసుకుంటున్నట్లు తెలుస్తోంది. పేకాట నిర్వాహకులకు కొందరు పోలీసుల సహకారం ఉందనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల పేకాట జూదరులకు సహకారం అందించారనే కారణంతో కొందరు పోలీసులకు జిల్లా అధికారులు తాకీదులు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. మట్కా, పేకాటకు బానిసైన పేదలు ఇందులో డబ్బులు పోగొట్టుకుని కుటుంబాలను ఛిద్రం చేసుకుంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కుందుర్పిలో పేకాట, మట్కాపై విచారణ చేపడితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని మండల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

పార్కును పరిశీలిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి

పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఇటీవల కురిసిన వర్షాలకు ఏవైనా దెబ్బతిని ఉంటే త్వరితగతిన మరమ్మతులు ప్రారంభించి పూర్తి చేయాలని నగర మేయర్ మహమ్మద్ వసీం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని 35వ డివిజన్ పరిధిలో ఉన్న శ్రీనగర్ కాలనీ పార్కులో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన ప్రహరీని బుధవారం మేయర్ డిప్యూటీ మేయర్ విజయ భాస్కర్‌రెడ్డితో కలసి పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ నగరంలోని చాలా ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని, గుంతలు పడటంతో వాటిని ప్యాచ్ వర్కులు చేయడానికి వేగంగా చర్యలు చేపట్టాలన్నారు. నగరంలోని అన్ని పార్కుల్లో పరిశీలించి ప్రహరీల నాణ్యతను పరిశీలించి శిథిలావస్థకు చేరిన వాటిని తొలగించి నూతన నిర్మాణాలకు అంచనాలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్ భూషణ్, ఏసీపీ శ్రీనివాసులు, ఈఈ రాధాకృష్ణ, డిఈ సుభాష్‌చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

అప్పేచెర్ల చెరువు పరిశీలన

పెద్దవడుగూరు : వర్షాలు కురుస్తున్నందున చెరువుల పటిష్టత, భద్రతపై గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులు ఆరా తీశారు. ఆర్డీవో బుధవారం మండలంలోని అప్పేచెర్ల సమీపంలో ఉన్న పెద్దచెరువు, చిన్న చెరువులను తహశీల్దార్ ఉషారాణి, చిన్ననీటిపారుదలశాఖ ఏఈ సూర్యనారాయణ్‌తో కలిసి పరిశీలించారు. వారు చెరువులో నీటి సామర్థ్యం, కాలువల భద్రత, తూములు, తదితర వాటి గురించి తెలుసుకున్నారు. అలాగే చెరువు కట్ట బలహీనం పడిన ప్రదేశాలను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున చెరువులు నిండి గ్రామాల ప్రజలకు ఎలాంటి ముప్పు వాటిల్లకూడదని అధికారులకు సూచించారు. చెరువులో పెరిగిన కంపచెట్లను తొలగించేలా చూడాలని చిన్న నీటిపారుదల శాఖ అధికారులకు తెలిపారు. అనంతరం ఆయన తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. వారి వెంట వీఆర్వో రామేశ్వరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

హెచ్‌ఎల్‌సి మరమ్మతులకు రూ. 35 కోట్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాయదుర్గం

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ మరమ్మతులు, అత్యవసర పనులకు సిఎం చంద్రబాబు రూ. 35 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఆయన బుధవారం పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చాక సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇటీవలే రూ. 48 కోట్ల వ్యయంతో కణేకల్లు, కదిరిపల్లి మధ్య వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. వైసిపి ప్రభుత్వం తుంగభద్ర ఎగువ కాలువ నిర్వహణ, అభివృద్ధి విషయంలో పూర్తి నిర్లక్ష్యం వహించిందన్నారు. కాలువ నిర్వహణకు ఒక్క రూపాయి ఖర్చు చేయలేదన్నారు. చాలా చోట్ల

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఎగువ కాలువ దెబ్బతినగా అండర్ టన్నెల్ కూడా పైకి లేచిందన్నారు. టిబి డ్యాంలో అవసరమైనంత నీరు ఉన్నా తీసుకురాలేక మాజీ సిఎం జగన్ జిల్లాకు అన్యాయం చేశారన్నారు. ఎగువ కాలవ దుస్థితిపై సిఎం చంద్రబాబుతో పాటు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లగా అత్యవసరంగా 11 పనులు చేపట్టేందుకు రూ. 35 కోట్లు మంజూరు చేశారన్నారు. అందులో 9 పనులు రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో ఉన్నాయన్నారు. కణేకల్లు చెరువు వద్ద నీరు వెలుపలకు వెళ్లే గేట్లకు కొత్త తలుపులు అమర్చాల్సి ఉందన్నారు. 105వ కిలోమీటర్ వద్ద నుంచి ఎగువ కాలువ గట్టు బలహీనంగా ఉన్నచోట మరమ్మతులు చేపడితే కాలువలో నీరు వచ్చాక గట్టు తెగిపోతుందనే భయం ఉండదన్నారు. 2400 క్యూసెక్కుల నీటిని తీసుకొచ్చేలా దశల వారీగా ఆధునీకరణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. మంజూరైన పనులను అత్యవసరంగా చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఆయనతో పాటు డి.హీరేహాళ్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, జనసేనపార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి మంజునాథ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

పుల్లేటి వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వీరన్నపల్లి సమీపంలో ఉన్న పుల్లేటి వాగు వంతెన నిర్మాణానికి రూ. 16.75కోట్ల వ్యయంతో బుధవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ముందుగా ఆయన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే కొండూరు, వీరన్నపల్లి, కొట్టాలపల్లి గ్రామాల్లో పర్యటించగా ప్రజలు పలు సమస్యలు తెలుపగా వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వీరన్నపల్లి వద్ద పుల్లేటి వాగు వంతెన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోఆర్డి నరసింహారెడ్డి, ఏపీవో పుల్లారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటలక్ష్మి, ఏఈఓ సునీత, సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు, క్లాస్-1 కాంట్రాక్టర్ హరినాథ్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు దివాకర్‌రెడ్డి, గంగరాజు, హరినాథ్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, పరమేశ్వరరెడ్డి, ఇటుకనాలు, చిరంజీవులు, గుత్తేదారుడు మడ్డిపల్లి రామసుబ్బారెడ్డి, ప్రసాద్‌యాదవ్, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పుల్లేటి వాగు వంతెన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

నేరాలు ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న టిప్పర్.. ఇద్దరు మృతి

శింగనమల : ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన బుధవారం శింగనమలలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండలంలోని శోధనపల్లి గ్రామా నికి చెందిన కురువ అట్టే రమణ(49), పేట నాగేశ్వర్‌రెడ్డి(52)వ్యక్తిగత పని కోసం ద్విచక్ర వాహనంపై నాయనపల్లి క్రాస్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో పోతురాజుకాలువ బ్రిడ్జి వద్ద రోడ్డు దాటుతుండగా అనంతపురం వైపు నుంచి వస్తున్న ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన టిప్పర్ వెనుక నుంచి వీరిని ఢీ కొనడంతో పాటు వారిపై దూసుకెళ్లడం తో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమా దాన్ని పరిశీలించారు. మృతదేహాలను 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. రమణ డ్రిప్పు కంపెనీలో పని చేసేవాడు. వీరి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రిని కడతేర్చిన కొడుకు

యాడికి : ఆస్తి తగాదాల నేపథ్యంలో కన్నతండ్రిని కొడుకు కడతేర్చిన సంఘటన బుధవారం యాడికిలో చోటు చేసుకుంది. సిఐ ఈరన్న తెలిపిన వివరాలు.. వరలక్ష్మినారాయణ(48)కు ఇద్దరు భార్యలు. స్థానిక వెంగమ నాయుడు కాలనీలో నివాసం ఉంటున్న మొదటి భార్య కుమారుడు వరకార్తీక్ ఆస్తి విషయమై మధ్యాహ్నం వాసవీ కళ్యాణ మండపం వెనుక వైపు తండ్రితో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో కత్తితో తండ్రి గొంతు, ఛాతిపై కత్తితో పొడవడంతో పాటు ఇటుక పెల్లతో తలపై మోది హత్య చేశాడు. వరలక్ష్మినారాయణ రెండో భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

బొమ్మనహాల్ : మండలంలోని సిద్దరాంపురం గ్రామ సమీపంలో చెట్ల పొదల్లో పేకాట ఆడుతుండగా జూదరలనట్లు ఎస్ఐ నబిరసూల్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు పోలీసులతో కలిసి దాడి చేసి 13 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 30 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట, మట్కా, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు

మట్కా బీటర్...

యల్లనూరు : మండలంలోని కొడవండ్లపల్లి గ్రామంలో మట్కా కార్యకలాపాలు నిర్వహిస్తున్న జి.తిరుపతినాయుడును అరెస్టు చేసి చీటీలతో పాటు రూ. 2,02,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సత్యబాబు తెలిపారు. స్టేషన్‌లో సిఐ విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ జి.శ్రీరామప్రసాద్, సిబ్బందితో కలిసి కొడవండ్లపల్లిలో తనిఖీలు చేపట్టి మట్కా నిర్వహిస్తున్న జి.తిరుపతినాయుడును అరెస్టు చేశారన్నారు. మండలంలో మట్కా, పేకాట, బెట్టింగ్, తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. సిఐతో పాటు ఎఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది అక్కులప్ప, బాలరాజు, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు.. బంగారు ఆభరణాలు స్వాధీనం

అనంతపురం క్రైం : తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడే దొంగను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్టు చేసి రూ. 8లక్షల విలువజేసే 12 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో బుధవారం సిఐ ఎన్.శేఖర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని రాంపల్లి గ్రామానికి చెందిన అగ్రహారం రంగస్వామి అలియాస్ రంగ తాళాలు వేసిన ఇళ్లలో ప్రవేశించి చోరీలకు పాల్పడే వాడు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ రాంబాబు ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు పాండవ, శివ, ఆంజనేయప్రసాద్ కాపుకాచి నిందితుడు రంగను నగరంలోని బళ్లారి రోడ్డులో బుధవారం అరెస్టు చేశారన్నారు. అతడి నుంచి రూ. 8లక్షలు విలువజేసే 12.5 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారన్నారు.

యువకుడు అరెస్టు

యల్లనూరు : ఓ యువతను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి అత్యాచారం చేసిన ఘటనలో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. మండల పరిధిలోని వెన్నపూసపల్లి గ్రామానికి చెందిన హరిజన ఓబులేసును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ సత్యబాబు తెలిపారు.

తాగునీటి నిధుల స్వాహాపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు

మండలంలోని నెలగొండ గ్రామంలో ప్రజలకు తాగునీటి సరఫరా కోసం విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధుల స్వాహాపై విచారణ జరిపాలని కోరుతూ బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ఎంపిడిఓ శ్రీకాంత్ చౌదరికి వినతి పత్రం అందజేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ నెలగొండ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 16 లక్షలు తాగునీటి సరఫరా కోసం మంజూరు కాగా అధికారులు, ప్రజాప్రతి కుమ్మక్కై స్వాహా చేవారని ఆరోపణలు ఉన్నాయన్నారు. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మారుతిప్రసాద్, జగ్గలి రమేష్, సాకే నాగరాజు, సభ్యులు సురేంద్ర, రామునాయక్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఓ శ్రీకాంత్ చౌదరికి వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలి

ప్రజాశక్తి-అనంతపురం

వైద్య ఆరోగ్య సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఇంటింటికికీ వెళ్లి ఫీవర్ సర్వే చేయాలని అసిస్టెంట్ మలేరియా జిల్లా అధికారి కె.సత్యనారాయణ, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి తెలిపారు. నగరం లోని డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం డిఎంహెచ్‌ఓ భ్రమరాంబికదేవి పర్యవేక్షణలో జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారులందరూ ఆయా మండల స్థాయి అధికారులను సమన్వయ పరచుకుంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటించేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీహెచ్వోలు జి.గిరిధర్‌రెడ్డి, మద్దయ్య, రామకృష్ణ, వినయ్‌కుమార్, నాగేంద్రప్రసాద్, హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-నార్పల

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని సర్పంచి రామాంజనేయులు తెలిపారు. మండలంలోని సిద్దరాచెర్ల పంచాయతీకి చెందిన దుర్గం గ్రామంలో బుధవారం 104 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బాలింతలు, ఇతర వ్యాధి గ్రస్తులకు మందులు పంపిణీ చేసి జాగ్రత్తలను సూచించారు. అలాగే దోమల నివారణకు సర్పంచి రామాంజనేయులు, డాక్టర్ మహేంద్రనాథ్ ఆధ్వర్యంలో గ్రామంలో నీటి నిల్వలపై మందును పిచికారి చేయించారు. రాత్రిపూట ఫాగింగ్ చేయిస్తామని తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శివకుమార్, అమృతాంజలి, ఫరీదాభాను, వీరనారాయణమ్మ, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దోమల లార్వాల నివారణకు స్ప్రే చేయిస్తున్న సర్పంచి

రైఫిల్ షూటింగ్‌లో 'ఆర్యన్' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల రాజమండ్రిలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో నగరంలోని ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనపరిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారని కోచ్ శ్రీకాంత్ తెలిపారు. అండర్-14 బాలికల పిస్టల్ విభాగంలో ధాత్రి శివాని, అండర్-14 బాలుర రైఫిల్ షూటింగ్ విభాగంలో తీక్షణ్ తృతీయ స్థానాలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరు డిసెంబర్‌లో భోపాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్ శ్రీకాంత్, శ్రీనివాసులు, తల్లిదండ్రులు అభినందించారు.

చెరువులో చేపలు వదిలిన వ్యక్తులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలోని శ్రీమజ్జనపల్లి చెరువులో అనుమతి లేకుండా చేపలు వదిలిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం టిడిపి నాయకుల ఆధ్వర్యంలో గ్రామస్తులు నరసింహమూర్తి, పాలయ్య, హనుమయ్య, శివన్న, బోరయ్య తదితరులు ఎంపిడిఓ బాలాజీకి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ సర్పంచికి, అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండా కొందరు వ్యక్తులు గత మంగళవారం చెరువులో చేపలు వదలడం తగదన్నారు. చేపలు వదిలిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో గ్రామస్తులు కెంచప్ప, సరోజమ్మ, ఓబయ్య, మల్లేష్, నీలమ్మ, నరసక్క, శివానంద, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో రైతులకు అపారనష్టం

బొమ్మనహాల్ : మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. ప్రధానంగా ఏలంజి, కొలగానహల్లి, బండూరు, బొల్లనగుడ్డం, కానాపురం, కొత్తూరు, మైలాపురం, లింగదహాల్, తిమ్మలాపురం గ్రామాల రైతులు వేదావతి నదిలో వేసుకున్న బోరుబావులు, ట్రాన్స్‌ఫార్మర్లు గల్లంతయ్యాయి. 5 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం ఆగిపోయింది.

మహిళా శక్తితో మార్పు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

స్త్రీ శక్తికి మించిన ఆయుధం ప్రపంచంలో మరొకటి లేదని ఆర్‌డిటి సంస్థ డైరెక్టర్ షీబా తెలిపారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని వేపులపర్తి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికలు ఎంత ఎదిగితే దేశం అంత అభివృద్ధి చెందుతుందన్నారు. ఎందులోనైనా బాలికలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే బాలల హక్కులు, బాల్యవివాహాలు, లింగ వివక్ష, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డిటి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ హేమలత, సిడిపిఓ లక్ష్మీప్రసన్న, సూపర్వైజర్ రామాంజనమ్మ, హెచ్‌ఎం రోషన్‌బాషా, సీవో మలోబులేసు, ఆర్‌డిసి సంస్థ సభ్యులు, సిబిటి టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిటి డైరెక్టర్ షీబా

25న పెన్నోబిలం ఆలయ హుండీ లెక్కింపు

ఉరవకొండ : మండలంలోని పెన్నహోబిలంలో వెలిసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉన్న శాశ్వత హుండీలను ఈ నెల 25వ తేదీ ఉదయం 9 గంటలకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో తెరిచి, కానుకలను లెక్కించనున్నట్లు ఈవో ఎస్.రమేష్‌బాబు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

రాయదుర్గం : ఈ నెల 25వ తేదీ మండలంలోని ఊడేగోళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో వికలాంగులకు ప్రత్యేక అవకాశాలు కల్పిస్తున్నట్లు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వికలాంగులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కొన్ని సంస్థలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఆయా సంస్థలు వికలాంగులకు ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు శిక్షణ ఇచ్చి పనిలోకి తీసుకుంటాయని తెలిపారు. వికలాంగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నట్టల నివారణ మందు పంపిణీ

నార్పల : మండలంలోని బొందలవాడ, నడిమిదొడ్డి గ్రామాల్లో బుధవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఐఎస్‌డిపి డాక్టర్ శ్రీలక్ష్మి పర్యవేక్షణ చేశారు. ఆమె మాట్లాడుతూ నట్టల నివారణ కార్యక్రమం ఈ నెలాఖరు వరకూ చేపడతామన్నారు. గొర్రెలు, మేకల రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ కె.గోవిందరాజు పాల్గొన్నారు.

28న విజయవాడలో విజ్ఞాపన దీక్ష

నార్పల : అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ విజయవాడలో చేపడుతున్న విజ్ఞాపన దీక్షకు కస్టమర్లు, ఏజెంట్లు పెద్దఎత్తున హాజరై దీక్షను జయప్రదం చేయాలని జిల్లా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.నారాయణప్ప బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

పుట్లూరు : మండలంలోని సాలవేముల గ్రామ సమీపంలోని ఓ పొలంలో ఉన్న 33 కెవి విద్యుత్ స్తంభం నేలకొరిగింది. విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందని ఆప్రాంత రైతులు, రైతు కూలీలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని గ్రామస్తులు, రైతులు, రైతు కూలీలు కోరుతున్నారు.

శింగనమల పిహెచ్‌సి తనిఖీ

శింగనమల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిసిహెచ్‌ఎస్ రవికుమార్ తనిఖీ చేశారు. ఆమె రికార్డులతో పాటు ఎక్స్‌రే, ఈసీజీ, రక్తపరీక్ష ల్యాబ్‌లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగుల పట్ల అశ్రద్ధ వహించవద్దని, ఓర్పు, సహనంతో వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుంతకల్లు-కదిరిదేవరపల్లి రైలు రద్దు

కళ్యాణదుర్గం రూరల్ : కదిరిదేవరపల్లి నుంచి గుంతకల్లు మీదుగా తిరుపతికి వెళ్లే రైలును నవంబర్ 1 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకూ రద్దు చేసినట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం-కదిరిదేవరపల్లి మధ్య ఆధునీకరణ పనులు చేస్తున్నందున రాకపోకలు నిలిపివేసినట్లు తెలిపారు.

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి

గుత్తి : వీరశైవ లింగాయత్(లింగ బలిజ)లను ఓబీసీలో చేర్చాలని మాజీ ఎంపీపీ, టిడిపి వీరశైవ సాధికార కమిటీ సభ్యుడు వీరభద్రయ్య బుధవారం అమరావతిలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి విన్నవించారు. అలాగే వీరశైవ లింగాయత్‌ల సమస్యలను మంత్రికి వివరించారు. వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చే అంశంపై సిఎం చంద్రబాబుతో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వీరభద్రయ్య తెలిపారు.

జీవో 117 రద్దు చేయాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. శెట్టూరు మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం ఎస్‌టియు సభ్యత్వ నమోదు చేపట్టారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులందరికీ ఐఆర్ ప్రకటించాలని, వీలైనంత త్వరగా 12వ పిఆర్‌సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్, రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ కె.కృష్ణమూర్తి మాట్లాడుతూ పిఎఫ్, డిఎ, ఆర్జిత సెలవుల బకాయిలు, 117 జీవో రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణ, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆనంద్‌రెడ్డి, మల్లికార్జునగౌడ్, గంగాధర్, సూరిబాబు, మంజునాథ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల'మెప్మా బజార్'

ప్రజాశక్తి-గుత్తి

స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూర్‌బి, కమిషనర్ బి.జబ్బార్ మియా సూచించారు. పట్టణంలోని మున్సిపల్ పాత కార్యాలయ భవనం వద్ద బుధవారం మెప్మా ఆధ్వర్యంలో బజార్ ఏర్పాటు చేశారు. అందులో స్వయం సహాయక సంఘాల సభ్యులు చేతి వృత్తుల ద్వారా తయారు చేసిన వస్తువులను ప్రదర్శనకు ఉంచారు. వారు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులో రుణాలు ఇస్తారన్నారు. ఆ రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి పొది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, మెప్మా సిఎంఎం శ్రీనివాస్‌రెడ్డి, సిఓ చంద్రశేఖర్, సురేఖ, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలో ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనుల్లో లక్షలాది రూపాయల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడైందన్నారు. వ్యవసాయ కూలీల కడుపు కొట్టి ఫోర్జరీ సంతకాలతో లక్షలాది రూపాయలు కాజేసిన వారిపై చర్యలు తీసుకొని, అవినీతి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, సిపిఐ నాయకులు చెన్నరాయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంద్రావతి, ఓబులేసు, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు

పెద్దాసుపత్రిలో ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంపు

ప్రజాశక్తి-అనంతపురం

డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబి.దేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. కెఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వినికిడి సమస్య ఉన్న పిల్లలకు ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. 126 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా స్పెషలిస్ట్ డాక్టర్లచే స్క్రీనింగ్ పరీక్షల అనంతరం 122 మందికి వినికిడి పరికరాలు అవసరమని నిర్ధారించారు. హాజరైన పిల్లలకు వారి తల్లిదండ్రులకు వినికిడి సమస్యలపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వినికిడి యంత్రాలు అవసరమైన వారికి త్వరలోనే అందజేస్తామని దీన దయాల్ సొసైటీ స్టేట్ ఛైర్మన్ ఆర్.రామాంజనేయులు, కోఆర్డినేటర్ రవితేజ తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన పిల్లలు, వారి తల్లిదండ్రులకు స్పందన ఆర్గనైజేషన్ వారు ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు.

సాగులో మెలకువలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-ఉరవకొండ

పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో శుభకర్ తెలిపారు. ఉరవకొండ రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం లో ఏవో జి.శుభకర్, మండల పశు వైద్యాధికారి శ్రీవిద్య పాల్గొన్నారు. ఏవో మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేలా రైతులను సమాయత్తం చేయడమే 'పొలం పిలుస్తోంది' ఉద్దేశమన్నారు. వెటర్నరీ డాక్టర్ మాట్లాడుతూ గోకులం షెడ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పశువుల వ్యాధులపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కె సిబ్బంది ఎం.లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరులో రక్తదాన శిబిరం

పెద్దపప్పూరు : హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి సహాయ సహకారాలతో బుధవారం పెద్దపప్పూరులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు జైభీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. పెద్దిరాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో పలువులు యువకులు రక్తదానం చేశారు.

పెండేకల్లు రిజర్వాయర్ పరిశీలన

పెద్దపప్పూరు : మండలంలోని పెండేకల్లు రిజర్వాయర్‌ను బుధవారం తహశీల్దార్ బాలాజీరాజ్ పరిశీలించారు. అనంతపురం నగరంలో అకస్మాత్తుగా వరదలు రావడం, రానున్న మూడు రోజులు భారీగా వర్ష సూచనలు ఉన్నాయన్న వాతావరణ శాఖ సమాచారం నేపథ్యంలో తహశీల్దార్ మండలంలోని ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే చాగల్లు ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న పెండేకల్లు రిజర్వాయర్‌కు నీరు విడుదల చేసిన నేపథయలో ఆయన పెండేకల్లు రిజర్వాయర్ పరిస్థితు లను పరిశీలించారు. అధికారులు ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో కిషోర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెండేకల్లు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ బాలాజీ

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE, ANANTHAPURAMU
(In the matter of appointment of guardian to the person and property of the minor DUDA HARITHA)
G.W.O.P. No: 65/2024
Between:
Duda Pooja ...Petitioner
And
To Whom So ever it may Concern. ...Respondent

ప్రకటన

పై నెంబరు దావాలో అర్జీదారురాలు అయిన **దూడ పూజ** తన మైనరు చెల్లెలు **దూడ హరిత** కు మరియు షెడ్యూలు దాఖలా ఆస్తికి సంరక్షకురాలుగా నియమించుటకు పై కోర్టు నందు అర్జీ దాఖలు చేసి ఉన్నారు. కావున సదరి కేసులో ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు నందు 18/11/2024వ తేది ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని యెడల పై కోర్టు వారు అర్జీదారురాలు పరముగా తీర్మాణం చేయుదురు అని తెలియజేయడమైనది.

షెడ్యూలు

Pension amount, gratuity and other death benefits relating to Duda Sreeramulu Naik, who worked as A.R.Constable in S.P.Office, Ananthapuramu District.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

S.GOVINDA RAJULU,
D.RAJU,
Advocates, Ananthapuramu.
Cell:9440823009, 9441575698.

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE, ANANTHAPURAMU
(In the matter of appointment of guardian to the person and property of the Mentally Retarted boy i.e V.Indrasena Reddy @ Kapu Indra)
G.W.O.P. No: 64/2024
Between:
Vardhikummati Gopal Reddy ...Petitioner
And
To Whom So ever it may Concern. ...Respondent

ప్రకటన

పై నెంబరు కేసులో అర్జీదారుడు అయిన **వర్ది కుమ్మతి గోపాల్ రెడ్డి** గారు మతిస్థిమితము లేని తన అన్న కుమారుడు అయిన **వి.ఇంద్రసేనా రెడ్డి @ కాపు ఇంద్ర** కు సంరక్షకుడుగా మరియు షెడ్యూలు దాఖలా ఆస్తికి గార్డియన్‌గా నియమించుటకు పై కోర్టు నందు అర్జీ దాఖలు చేసి ఉన్నారు. కావున సదరి కేసులో ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు నందు 15/11/2024వ తేది ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని యెడల పై కోర్టు వారు అర్జీదారుడు పరముగా తీర్మాణం చేయుదురు అని తెలియజేయడమైనది.

షెడ్యూలు

Amount relating to Chinna Rayudu who worked in BSF (ppo No:02183180213 dt.24/12/2018) i.e Pension amount relating to Chinna Rayudu who worked as Constable III.Bn BSF
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

T.R.NARAPA REDDY,
Advocate, Ananthapuramu.
Cell:9440152722

ప్రాణాలను నిలిపే రక్తదానం : ఎస్పీ

జ్ఞాపికను అందిస్తున్న ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ప్రమాద సమయంలో చేసే రక్తదానం ప్రాణాలను నిలుపుతుందని ఎస్పీ పి.జగదీష్ అభిప్రాయపడ్డారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నాడు ఇటుకలపల్లి పోలీసు స్టేషన్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, కదిరి ప్రాంతాల నుంచి యువత స్వచ్ఛందంగా పాల్గొని 100 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ సమాజ భద్రత, రక్షణ క్రమంలో పోలీసులు ప్రాణ త్యాగం చేస్తున్నారని, అలాంటి వారిని స్మరించుకుంటూ అమర వీరుల దినోత్సవాలను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే రక్తదాన శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. వీటితో పాటు ప్రజలు, విద్యార్థులకు పోలీసు విధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. హెల్మెట్ లేకుండా వేగంగా వాహనాలు నడపరాదన్నారు. గంజాయి, మద్యం తదితర వ్యసనాలను దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు, ఇటుకలపల్లి సిఐ హేమంత్ కుమార్, ఎస్ఐ విజయకుమార్‌తో పాటు .జీజీహెచ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన

పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఇటుకలపల్లి సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎస్కెయు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తదానం ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షుడు నాగశివారెడ్డి, కార్యదర్శి వంశీ, సందే, బండేష్, రాముడు, గణేష్ మోహన్, చంద్రా నాయక్, శాంతిరాజ్, హర్ష, హరి, విలియమ్స్, వెంకటేష్, అక్షయ్, సతీష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణలో యువత పాత్రపై వ్యాసరచన పోటీలు

జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం వివిధ పాఠశాలల్లో సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అన్న అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, అవగాహన సదస్సులు నిర్వహించారు. సమాజ శ్రేయస్సు, భద్రతల కోసం పోలీసులు అందిస్తున్న సేవలు, త్యాగాలను వివరించారు.

రైల్వే సమస్యల పరిష్కారంపై స్పందించండి : ఎంపి

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం జిల్లాలో రైల్వే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ కోరారు. రైల్వే సమస్యలపై సికింద్రాబాద్, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ బెంగళూరు ప్యాసింజర్‌ను అనంతపురం వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు వచ్చిన కాపీని ఆయనకు అందించారు. దీనిని త్వరలో ప్రారంభిస్తామని రైల్వే జీఎం ఎంపీకి తెలియజేశారు. రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను అనంతపురం స్టేషన్‌లో నిలిపాలని ఎంపీ కోరారు. అనంతపురం రైల్వేస్టేషన్లో లిఫ్ట్ పనులను పూర్తి చేయాలన్నారు. కిసాన్ రైల్ ను ప్రారంభించాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

ఉరవకొండ : చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీడీవో రవి ప్రసాద్ వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కమిటీ ఛైర్మన్ వెలిగొండ నరసింహులు అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. మంజూరైన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే అజెండాలోని అంశాలను ఆమోదించారు. ఎంపిడిఒ ఆసుపత్రిని వీలైనంత త్వరలో నూతన భవనం లోకి మార్చాలని వైద్యులకు సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు పావని, వెంకటేష్ నాయక్, సర్పంచి శివమ్మ, నాయకులు రామప్ప, అశోక్ కుమార్, పాల్గొన్నారు.

మురుగు తొలగింపు

రొద్దం : మండలంలోని చినకోటపల్లిలో పేరుకుపోయిన మురుగు, ముళ్ళ కంపలను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల క్రితం ప్రజాశక్తిలో పడకేసిన పారిశుధ్యం అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప ఆధ్వర్యంలో పంచాయతీ వర్కర్లు దాదాపు రెండు మూడు సంవత్సరాల నుంచి పూడుకపోయిన మురుగు కాలువలను, మట్టిని తొలగించి కాలువల శుభ్రపరిచారు. అదేవిధంగా కాలువలో ఉన్న పెద్దపెద్ద ముళ్ళ కంపలను తొలగించి శుభ్రం చేశారు.

కౌలురైతుల గుర్తింపు కార్డులతో ప్రయోజనం

వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మద్దిలేటి

ప్రజాశక్తి -అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు అందిస్తున్న కౌలు గుర్తింపు కార్డుతో ప్రభుత్వం అందించే సాయం పొందే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మద్దిలేటి తెలిపారు. బుధవారం చియ్యేడు, పూలకుంట రైతు సేవాకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మద్దిలేటి మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి పంటల్లో రైతులు అధిక దిగుబడులు సాధించాలని తెలిపారు. అనంతరం రైతులకు మట్టి పరీక్ష ఫలితాలు, కౌలు రైతు గుర్తింపు కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ, అలేఖ్య, రైతు సేవాకేంద్రం సహాయకులు శ్రావణి, కవిత, రైతులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోందిలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

టిడిపిలో చేరుతున్న పలు కుటుంబాలు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి మడకశిర రూరల్

మండల పరిధిలోని తురకవాండ్లపల్లి వైసీపీ నాయకులు బుధవారం టిడిపిలో చేరారు. మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి సమక్షంలో బుడ్డప్ప, జయ రామప్ప, ఫక్రుద్దీన్, సోమకుమార్, రామాంజనేయులు, ఆంజనేయులు, చిత్ర శేఖర్, హనుమంతరాయప్ప, తిప్పేస్వామితోపాటు పలు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. వీరికి గుండుమల తిప్పేస్వామి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పోలీసు అమరవీరుల కుటుంబాలను పరామర్శించే కార్యక్రమంలో భాగంగా పుట్టపర్తి మండల పరిధిలోని బీడుపల్లి గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ కుటుంబాన్ని ఎస్పీ రత్న బుధవారం పరామర్శించారు. చంద్రశేఖర్ విధి నిర్వహణలో నక్సలైట్లు కాల్పుల్లో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎస్పీ బుధవారం చంద్రశేఖర్ ఇంటికి వెళ్లి తల్లి నారాయణమ్మ , కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, సిఐ సునీత సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల సబ్‌స్టేషన్‌లో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి-నార్పల

స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం మధ్యాహ్నం సిటీ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పెద్దశబ్దంతో పేలిపోయి మంటలు చెలరేగాయి. సబ్ స్టేషన్‌లో ఉదయం నుంచి ఉద్యోగులు, కార్మికులు మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ సరఫరా ఆన్ చేయగానే ఒక్కసారిగా పెద్దశబ్దంతో పేలిపోయి మంటలు చెలరేగాయని విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులు, కార్మికులు తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని మంటలు అదుపులోకి రాగానే కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి నూతన సిటిని అమర్చి విద్యుత్ సరఫరా చేస్తామని లైన్‌మెన్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు

రోడ్డు ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - చిలమత్తూరు

కొడికొండ చెక్‌పోస్ట్ లోని సమర్థనం ట్రస్టుకు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ సంస్థలో పని చేసే సిబ్బంది ఎంపిడిఒకు రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎంతో మంది దివ్యాంగులకు విద్యతో పాటు ఉపాధిని కల్పిస్తున్న సంస్థకు రోడ్డు లేక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే స్పందించి సంస్థకు కొడికొండ చెక్ పోస్టు నుంచి సమర్థనం ట్రస్ట్ వరకు రోడ్డు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బిటిపిలో గంగపూజ

హాజరుకానున్న ఎమ్మెల్యేలు అమిలినేని, కాలవ

కళ్యాణ్ దుర్గం రూరల్

ఎగువన కురిసిన భారీ వర్షాలకు కళ్యాణదుర్గం ప్రాంత జీవనాడి అయిన భైరవానితిప్ప ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరడంతో గురువారం ఉదయం ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, కాలవ శ్రీనివాసులు బిటిపి వద్ద గంగమ్మకు జలహారతి ఇచ్చి కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేస్తారని ఎమ్మెల్యే సురేంద్రబాబు కార్యాలయ ప్రతినిధి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని టిడిపి సీనియర్ నాయకులు, మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అభ్యంతరాలు ఉంటే తెలపండి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న గ్రేడ్-3 ఎఎన్ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించడంలో భాగంగా వారి సీనియారిటీ లిస్టును అనంతపురం జిల్లా అధికారిక వెబ్‌సైట్ ananthapuramu.ap.gov.inలో, సంబంధిత అధికారులకు మెయిల్స్ ద్వారా పంపినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఈబి దేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లిస్టుపై ఏవైనా విన్నపాలు, అభ్యంతరాలు ఉంటే సదరు ఎఎన్ఎంలు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమర్పించవలసినదిగా డిఎంహెచ్ఒ తెలిపారు.

టపాసుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయొద్దని వినతి

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో టపాసుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమేష్, ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ మహబూబ్ బాషాకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యాసంస్థల వద్ద టపాసుల విక్రయాలు జరపకూడదని నిబంధన లు ఉన్నా కొందరు దుకాణాల నిర్వాహకులతో లాలూచీపడి అనుమతి మంజూరు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, హైస్కూల్ హెచ్ఎంను ప్రశ్నిస్తే నిర్లక్ష్య ధోరణిలో సమాధానం ఇచ్చారన్నారు. టపాసుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అనుమతిస్తే విద్యార్థి సంఘాలను కలుపుకొని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు చరణ్, సాయి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులుగా పయ్యావుల మోహన్, ఉపాధ్యక్షులుగా మైలాపూర్ తిప్పేస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న చౌకధాన్య డిపోల డీలర్లతో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా రేషన్ డీలర్ల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన తహశీల్దార్ మునివేలు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే నిత్యావసర సరుకులను గ్రామాల్లో రేషన్‌కార్డుదారులకు సకాలంలో సక్రమంగా అందించాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. డీలర్ల సంఘం కోశాధికారిగా ప్రభయ్య, కార్యదర్శిగా ఆనంద్, సభ్యులుగా హనుమంతు, భాస్కర్, తదితరులను ఎన్నుకున్నారు.

మాధవ్.. నోరు అదుపులో పెట్టుకో...

శింగనమల : మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని టిడిపి అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ప్రాధాన్యత క్రమంలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వారిని, మహిళలను తక్కువ చేసి అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఇకపై ఇలాంటి చౌకబారు మాటలు మాట్లాడితే జిల్లాలో తిరగలేవని హెచ్చరించారు.